ముచ్చటలు - మురిపాలు

శ్రీ హరగోపాల్, బి. ఏ.

★

"ఇవాళ బావ వస్తాడని అందరూ ఎంత సంబరపడుతున్నారు! అమ్మ అందరిని పెందరాళే లేపి, తలంట్లుపోసింది. నాన్నగారు నిన్ననే సాయంత్రం వచ్చేటప్పుడు, మిషను కుట్టువానికిచ్చిన కొత్త బట్టలను తెచ్చారు. అన్నయ్యా, తమ్ముడు వాటిని కట్టుకుని బావను తీసుకురావడానికి స్టేషనుకు వెళ్లారు. అక్కయ్య ఇవాళ ఎంత కళకళలాడుతోంది! అమా తను వెళ్ళి, హైదరాబాద్ స్టోర్సులో, ఎంతోసేపు తనిఖీచేసి సెలక్టుచేసి కొన్న, ఆ గులాబిరంగు-చీర కట్టుకుని, తన వంకలజుట్టును ఎంత అందంగా దువ్వుకుంది!...తన ముఖంమీదకు ఆ నులివెంట్రుకలు అందంగా పడేలా, ప్రయాసపడి ఎంతబాగా అమర్చుకుంది!...తనూ, తన స్నేహితులు కలిసి, దీనదయాళు గారి బంగారం కొట్టులో కొన్న కొత్తరకం నెక్లేసు మెళ్ళో వేసుకుంది. తన కాళ్ళకు చేతులకు, తన అత్తగారు, మామగారు చేయించిన పట్టాలు, గాజులు వేసుకుంది. క్రిందటిసారి తనూ, బావ కలిసి తిరుపతి వెళ్ళినప్పుడు, మద్రాసుగూడ అలా వెళ్ళినపుడు, బావ ఎంతో ముచ్చటపడి కొన్న, ఆ చెమికీ జాకట్టును తొడుక్కుని కూనిరాగాలు తీసుకుంటూ మంచంమీద బోర్లాపడుకుని ఎంత వయ్యారంగా పత్రిక చదువుతోందో!...ఇదంతా "ఆయన" వస్తాడనే సంబరంకాబోలు! పైకి నేను అంటే మొట్టుతుంది బాబోయ్!...నేనూ, రేపు 'ఆయన' వస్తాడంటే ఇలానే మధనపడతాను కాబోలు!" అని శారద తనలో భావించగానే, సిగ్గుతో ఆమె బుగ్గలు కందిపోయాయి. ఎవరైనా పసికట్టారేమో అని నాలుక కరుచుకుని, అటుఇటు చూచి, అమ్మ ఉన్న వంటింట్లోకి దారితీసింది.

అమ్మ ఏమిటో రకరకాల పిండివంటలు, పత్రికలో చూచి చదువుతూ చేయజూస్తోంది.

"ఏమిటే అమ్మా! ఆ పుస్తకంలో చూస్తూ వండుతున్నావ్" ప్రశ్నించింది శారద.

"వచ్చావా తల్లీ! రా! నిన్ను పిలుద్దామని అనుకుంటూంటే నీవే వచ్చావ్. ఇది నాకు చదివి చెప్పమ్మా!" అని అంది పనిభారంవల్ల ఊపిరి తీసుకుంటూ రాజ్యలక్ష్మి.

ఇంతలో పక్కఇంటి రంగమ్మ వచ్చి "ఏమండోయ్! రాజ్యలక్ష్మమ్మగారు! ఏమిటి హడావిడి? వేపపువ్వు పచ్చడి తినడం అయిందా?" అని ప్రశ్నించింది నిష్ఠూరంగా.

"వేపపువ్వు పచ్చడేమిటండీ?" అని ప్రశ్నించింది రాజ్యలక్ష్మి ఆశ్చర్యపోతూ.

"ఇవాళ సంక్రాంతి కదండీ! అందుచేత పరగడుపున, వేపపువ్వు పచ్చడి తినవద్దూ?" అని గదమాయించింది గంభీరంగా రంగమ్మ.

శారద పకపకనవ్వింది. "పిన్నిగారూ! మీరు పూర్తిగా మన పండుగలు, మన ఆచారాలు మర్చిపోయినట్లున్నారు. సంక్రాంతికి, సంవత్సరాదికి తేడానే తెలియదా? వేపపువ్వు పచ్చడి తినేది సంవత్సరాదికిగాని సంక్రాంతికి కాదు" అంది.

"అయ్యో రామా!" అని దవడలు నొక్కుకుని "మా చంటివెధవ గోలచేస్తే చేసిపెట్టాను కూడాను" అంది రంగమ్మ. ఒక్కక్షణం ఆగి "ఏమిటక్కయ్యగారు! చాల హడావిడిగా వున్నారు?" అని మళ్ళీ ప్రశ్నించింది.

"ఏం చెప్పను అక్కయ్యా! ఇవాళ, రాకరాక అల్లుడుగారు వస్తున్నారంటే నాకు మూడ్డిమీద గుడ్డ కూడ వుండడంలేదు" అంది రాజ్యలక్ష్మి నూనెలో 'చుయ్'మనిపిస్తూ.

"అయ్యో రామా!" అసలు వచ్చినపనే మర్చిపోయాను. చూడక్కయ్య మీ ఇంట్లో రెండు కరివేపాకు రెబ్బలుంటే ఇస్తావా? మా మరిది కరివేపాకు రసం లేకపోతే అన్నమే ముట్టరు. మా పెద్దవెధవకి, బజారుకెళ్ళేటప్పుడు మరీమరీ చెప్పానుసుమండీ! వాడు అన్నీ తెచ్చాడుకాని ఇదిమాత్రం మర్చిపోయాడు. వాడు చదివింది బి.ఏ. గాని వంకాయలు బేరం చెయ్యడంగూడ తెలియదు" అంది తన బాధను, అసహాయస్థితిని వెళ్ళగక్కుతూ రంగమ్మ.

"పిన్నిగారు, మీ పిల్లలను 'వెధవ వెధవ' అని పదేపదే తిడుతున్నారు, ఇవాళ తిట్టిన తిట్లన్నీ దీవనలవుతాయండి! అందులో తల్లి తిట్లన్నీ ఎప్పుడూ దీవనలే" అంది కరివేపాకు ఇస్తూ.

"వస్తానమ్మా! నావల్ల పనికి ఇబ్బంది కలిగిందో ఏమో! కర్మ!" అని రంగమ్మ నిష్క్రమిస్తూ వుండగా "పిన్నిగారు! ఇవాళ ద్వారబంధాలు, తలుపులూ జాగ్రత్త! లేకపోతే భోగి మంటలకు ఆహుతవుతాయి" అని నవ్వుతూ అంటూ దొడ్డి తలుపు చేరవేసింది శారద.

ఇంతలో బాబిగాడు "అమ్మా! అమ్మా! బావ వచ్చాడే" అని అరుచుకుంటూ వచ్చాడు వంటింట్లోకి. వెంటనే రాజ్యలక్ష్మి చెయ్యి కడుక్కొని, "అన్నయ్యను నాన్నగార్ని, ఆ లైబ్రరీలో ఆ కచేరీలో వెళ్ళి పిలుచుకురా" అంది చెయ్యి తుడుచుకుంటూ.

"నాన్నగారు, అన్నయ్య, బావ అందరూ హాల్లో కూర్చున్నారమ్మా!" అన్నాడు బాబిగాడు.

"శారదా! బావ కడుక్కోవడానికి, త్రాగడానికి నీళ్ళందియ్యి" అని పురమాయించి తను వసారాలోకి వచ్చింది రాజ్యలక్ష్మి.

"చూడమ్మా! బావని వచ్చేటప్పుడు నాకు హేండ్ కెమెరా తీసుకురమ్మంటే తీసుకురాలేదు" అని నేరం చెప్పాడు రఘు.

"ఉస్." తప్పని సంజ్ఞచేసి "అంతా కులాసాయేనా?" అని ప్రశ్నించింది రాజ్యలక్ష్మి అల్లుడికేసి చూస్తూ.

"హి హి హి అంతా కులాసాయేనండి" అన్నాడు రమేష్ భూమికేసి చూస్తూ సిగ్గుపడుతూ.

అల్లుడు కొత్తమూలంగా సిగ్గుపడుతున్నాడని గ్రహించి వంటింట్లోకి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

"ఈమధ్య ఏదో చిత్రానికి మాటలు పాటలు వ్రాస్తున్నావని విన్నాను నిజమేనా?" అని ప్రశ్నించారు శరభయ్య అల్లుడిన్ని.

"అవును మావా! 'బ్రతికిపోవాలంటే;' అనే చిత్రానికి వ్రాస్తున్నాడు" అన్నాడు రఘు.

బావమరిది మాటకు నవ్వి "ఇదే ప్రథమమండి! ఏదో వ్రాస్తున్నాను. దీనిమీద అంతగా ఆశ పెట్టుకోలేదు" అని నసిగాడు రమేష్.

"రెండుమూడు అయితేనేగాని వైద్యుడు కాడు. దానికేంలే కాని నిరుత్సాహపడకు. సాహిత్య గోష్ఠులలో నీ పేరు వింటున్నప్పుడు నీకు భవిష్యత్తు వుందని అప్పుడే అనుకున్నాను" అన్నాడు శరభయ్య.

"ఏమోనండి! అంతా భగవంతునిదయ, మీ చలవ" అన్నాడు రమేష్.

"లే నాయనా! చాలా దూరంనుంచి వచ్చావు; నీళ్ళు పోసుకో. అబ్బాయి! రఘు! నాతో రా భోగి పళ్ళు తీసుకువద్దువుగాని" అనిచెప్పి కండువా బుజాన్న వేసుకుని వీధిలోకి నడిచాడు శరభయ్య.

2

సరిగా సాయంత్రం 5 గంటలయింది. బీచివద్ద కళకళలాడుతోంది. ఇసుకతిప్పలమీద పిల్లలు పిల్లి మొగ్గలు వేస్తున్నారు. దంపతులు చెయ్యిచెయ్యి పట్టుకుని నడుస్తున్నారు. బొంబాయి మిఠాయి అమ్మేవాడు, వాచీలను, సైకిళ్ళను ఆ సాగే మిఠాయితో చేస్తూ, పాటలు పాడుతూ, వాటిని పిల్లలకిచ్చి, వాళ్ళ దగ్గరవున్న డబ్బులు గుంజుకుంటున్నాడు. వీధి నాట్యకత్తెలు నాట్యము చేస్తున్నారు. ఇదంతా చూసి సముద్రుడు సంతోషం పట్టలేక బలంకొద్ది తాకుతూ పెద్దగా ఘోష పెడుతూ పరవళ్ళు త్రొక్కుతున్నాడు.

దూరంగా బుడగలమ్ముతున్నవాడ్ని చూసి "అక్కయ్యా! నాకు ఆ బుడగ కావాలి?" అని మారాంచేశాడు బాబిగాడు.

"రఘు! వీడికది కొనిపెట్టు" అన్నాడు రమేష్.

"అక్కయ్యా! నేనుకూడ వాళ్ళతో అల్లా వెళ్ళి వస్తాను" అని దీనంగా అడిగింది శారద. కాసేపు తటపటాయించి, "సరే పో! వంటిమీద నగలు జాగ్రత్త! నీవు వట్టి తొందరపిల్లవి" అంది శోభ.

ఆ మాటకు మూతి తిప్పుకుంటూ అన్నయ్యను, తమ్ముడ్ని అనుసరించింది శారద.

"శోభ! నాతో మాట్లాడటం, కనిపించడం మానేశావేం?" దగ్గరగా జరిగి అడిగాడు రమేష్.

దూరంగా జరుగుతూ "మీరు నాకు కనిపించారు కనుకనా? ఇన్నాళ్ళు" అంది విసురుగా.

"కోపమొచ్చిందా?" లాలనగా అడిగాడు చెయ్యిపట్టుకుని లాగుతూ.

"వెళ్లండి ఎవరైనా చూస్తారు."

"ఇవాళ సినిమాకు వెడదామా?"

"మీరు వ్రాసిన సినిమా ఏంలేదు. నన్ను మెప్పించడానికి, మీరు చూపించడానికి" అంది ముఖం మరోవైపుకు త్రిప్పుకుని.

"శోభ! ఇన్నాళ్ళు ఆలస్యం చేశాననేగా నీ నిర్లక్ష్యం. ఏ ఉద్యోగం లేకుండా అత్తవారింటికొస్తే అల్లుడికి ఏమైనా గౌరవముంటుందా! నీవే చెప్పు.— అందుచేతనే ఇన్నాళ్ళు రాలేదు. ఇప్పుడైన నన్ను అనుగ్రహించు" అన్నాడు రమేష్ లాలిస్తూ.

"మీ మొగాళ్ళెప్పుడూ ఇంతే. ఆడవాళ్ళ మెతకతనం గ్రహించి, ముఖస్తుతితో ఉబ్బిస్తారు" అని ఆతని కండ్లలోకి చూసింది శోభ.

ఇంతలో ఒకటుడగ వారి ఇద్దరి ముఖాలమీద వాలి నిలబడింది. ఇద్దరూ కంగారుపడి చూసేసరికి ఎదురుగా బాబిగాడు నవ్వుతూ కనిపించాడు. "అన్నయ్యా! అక్కయ్య బావతో మాట్లాడుతోంది" అన్నాడు పకపకమంటూ.

శోభ వాడి మాటలకు ముచ్చటపడి, వాణ్ని ఎత్తుకుని, గట్టిగా కౌగలించుకుని, వాడి బుడగను వాడిచేతిలో పెడుతూ "బావతో అక్క మాట్లాడితే ఏంరా? నీకేం తెలిసిందిరా నవ్వడానికి?" అని అడుగుతూ గట్టిగా ముద్దుపెట్టుకుంది.

"బావ! ప్రొద్దుపోయింది. టాక్సీ సిద్ధంగావుంది. బయలుదేరండి" అన్నాడు రఘు.

"శారద అక్కయ్యనడుగు ఏమంటుందో?" అన్నాడు రమేష్.

"నేనెందుకడగాలి? నీవే అడుగు" అంది శారద.

"ఎవరూ అడగక్కరలేదు. ఇంటికి పోదాం అని చెప్పు బాబు" అంది శోభ బాబిగాడితో.

వచ్చీరాని మాటలతో బాబిగాడు అలా అంటూంటే అందరూ నవ్వుతూ టాక్సీ ఎక్కారు.

హారన్ కొట్టుకుంటూ టాక్సీ జోరుగా పరుగెత్త సాగింది రోడ్డుమీద. దూరంగా ఉన్న పార్కులోని రేడియో పాట వినిపించగానే రమేష్, "త్రుళ్ళిపడి, "శారద మీ అక్కయ్య మొగుడు వ్రాసిన పాట రేడియోలోంచి వినిపిస్తోంది. నీవు మీ అక్కయ్య జాగ్రత్తగా వినండి" అన్నాడు నవ్వుతూ రమేష్.

అందరూ ముసిముసి నవ్వులు నవ్వుతూ విన సాగారు ఆ పాటను.

"సంక్రాంతి! వెదజల్లవే! నవ్యకాంతి!
చలిలో వణికించేటి చెడ్డరోజులు పోయి
ముదము చేకూర్చెడి మంచిరోజులు మాకు
వెదజల్లవే సంక్రాంతి! వెదజల్లవే నవ్యకాంతి!
నీచభావాలన్ని భోగిమంటలలోన
భస్మమైపోయి, మసియైపోయి,
క్రొంగొత్తవెలుగులో క్రొత్తభావాలను,
మంచిభావాలను, వెదజల్లవే సంక్రాంతి!
చీకటిలో కొట్టుకొను యుద్ధోన్మాదులకు
'శాంతి' యను కాగడా చూపించవమ్మ!
వసుధైక కుటుంబము ఇల వర్ధిల్ల
విజ్ఞానకాంతినే వెదజల్లవమ్మ!
సంక్రాంతి! వెదజల్లవే! నవ్యకాంతి!"

ఆనాటి రాత్రి, రాబోయే సంక్రాంతి, పాటలోని 'నవ్యకాంతిని' వెదజల్లినట్లు కలగన్నారు అందరూ